# భూములు ఆగమైతయ్

- ధరణిపై కాంగ్రెస్ నేతల కడుపుమంట
- పట్వారీల వ్యవస్థ తెస్తామంటూ ప్రచారం
- మళ్లా భూ పంచాయితీలే అంటూ రైతుల నిట్టూర్పు
- హస్తం పార్టీ నేతలకు ఎవుసం తెలుసా అంటూ

కర్షకుల్లో పెల్లుబికిన ఆగ్రహం



**ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!**



## రైతులకు ఇబ్బందులే..

రైతుల కష్టాలను స్వయంగా సీఎం కేసీఆర్ చూసి ధరణిని తీసుకువచ్చిండ్రు. దీంతో రైతులకు రైతు బంధు, రైతు బీమా డబ్బులు, రైతుల కు బ్యాంకులు అప్పుగా ఇచ్చే రుణాలు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. అంతే కాక తమ భూమిని ఎవరు అక్రమంగా స్వాధీనం చేసుకోకుండా ధరణి పోర్టల్ మాకు రక్షణగా ఉన్నది. కాంగ్రెసోళ్లు మేము అధికారంలోకి వస్తే ధరణిని తీసివేస్తామంటుండ్రు. ధరణి తీసేసి రైతులకు చిప్ప చేతికియాలని వస్తుంది. కాంగ్రెస్ రైతుల బాగు కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నాడు. ఆయనకే మ మద్దతు.. మరో మారు కూడా సీఎం కేసీఆరే కావాలి.

**- బాలయ్య, రైతు, గోపులాపురం గ్రామం, పెంట్లవెల్లి మండలం**

## నిమిషాల్లో రిజిస్ట్రేషన్.. గంటల్లో మ్యుటేషన్



తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ చాలా బాగుంది. ధరణితో భూ సమస్యలు పరిష్కారం కావడమే కాకుండా రైతుల భూములకు భద్రత కలిగింది. భూమి మార్పిడి కావాలంటే రైతు వేలిముద్ర, సంతకం లేనిదే రిజిస్ట్రేషన్ కాదు. భూ క్రయవిక్రయాలు జరిగేందుకు ఎలాంటి పైరవీ లేకుండా నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్, గంటల్లోనే మ్యుటేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. రైతులు బాగుపడుతుంటే కాంగ్రెస్ నాయకుల కండ్లు మండుతున్నాయి. ధరణిని రద్దు చేసి పాత కాలం నాటి రెవెన్యూ వ్యవస్థ తెస్తామని కాంగ్రెసోళ్లు చెబుతున్నారు. ధరణిని తీసివేస్తే మళ్లీ దళారీ వ్యవస్థకు తెర తీసినట్లే. వీఆర్వో వ్యవస్థ వస్తే అన్నదాతలకు కష్టాలు మళ్లీ మొదలైతాయి. పైరవీకారులు రైతులకు మధ్య గొడవలు సృష్టించి లబ్ధిపొందుతారు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్న కౌలు చట్టంతో పట్టాదారులకు, కౌలు రైతులకు పంచాయితీలు షురూ అవుతాయి. కాంగ్రెసోళ్ల మాటాలు నమ్మితే ప్రజలు ఆగమైతారు.

**- సేవ్యానాయక్, రైతు, కడ్తాల్ మండలం**

## కాంగ్రెస్ వస్తే దళారుల పెత్తనమే..



కాంగ్రెస్ నాయకులు ధరణి తీసివేస్తామంటే తాసీల్దార్ కార్యాలయంలో దళారుల పెత్తనమే నడుస్తుంది. గ్రామాల్లో భూ సమస్యల తగాదా పెరిగి పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తది. తెలంగాణ ప్రభుత్వం రైతులకు భూ సమస్యలు లేకుండా చేయాలని ధరణిని సీఎం కేసీఆర్ తీసుకొచ్చారు. దీంతో రైతుల భూముల వివరాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాసీల్దార్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్లు భూమి మార్పిడి ప్రక్రియలు సులువుగా అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే భూ సమస్యలు మళ్లీ మొదటికొస్తాయి. పాత పద్ధతి అంటే మళ్లీ కష్టాలు కొన్ని తెచ్చుకోవడమే అవుతుంది. సీఎం కేసీఆర్ సారే మళ్లీ అధికారంలో ఉండాలి. ధరణిని కొనసాగించాలి.

**- శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నక్కలపల్లి, పెద్దకొత్తపల్లి మండలం**

## ధరణితో రైతులకు దరిద్రం పోయింది



ధరణి రావడంతో మా రైతులకు పట్టిన దరిద్రం పోయింది. పట్వారి వ్యవస్థను తప్పించి ధరణిని తీసుకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. ధరణి వచ్చినాక దళారీ వ్యవస్థ కనిపిస్తలేదు. గతంలో నాయకులు చెప్పిన వారి పేర్ల మీదనే అధికారులు భూములు రిజిస్ట్రేషన్ చేసేవారు. ఇపుడు ధరణి వచ్చినాక అలాంటి పరిస్థితి లేదు. స్లాట్ బుక్ చేసుకున్న 24 గంటలలో రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. గతంలో రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగెలా తిరిటోళ్లం. అయినా పనిజరిగేది కాదు, దళారులకు మాముళ్లు ఇస్తేనే అది కూడా వారం, పదిరోజులు అవుతుండే. మా భూములు ఒక్కరిపై ఒక్కరికి పట్ట అయితుండే. ఇపుడు ధరణితో ఎలాంటి తపులు జరగడం లేదు. ధరణి వచ్చినాక మా పొల్లాలు భద్రంగా ఉన్నాయి. రైతుబంధు డబ్బులు మా అకౌంట్‌ల్లో సక్రమంగా పడుతున్నాయి. సీఎం కేసీఆర్ రైతుల గురించి ఆలోచించే ధరణిని తీసుకువచ్చిండ్రు. కాంగ్రెసోళ్లు మాత్రం తిరిగి దళారులకు అప్పజెప్పాలని చూస్తుండ్రు. ధరణిని బంగాళాఖాతంలో పడేయాలని అన్నడానికి రేవంత్‌రెడ్డికి సిగ్గుండాలి. ఇలాంటి కాంగ్రెస్ మాకొద్దు. రైతుల బాగు కోసం ఆలోచించే కేసీఆర్ కావాలి.

**- భగవంత్‌రెడ్డి, రైతు, గోపులాపురం, పెంట్లవెల్లి మండలం**

## మళ్లీ పాత పద్ధతి అంటే ఇబ్బందే..



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణీ వెబ్ సైట్‌ను కాంగ్రెస్ వాళ్లు మేము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామంటున్నారు. అలా చేస్తే తిరిగి పాత పద్ధతే వస్తే ఇబ్బందులు ఎదుర్కొవాల్సిందే. సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన ధరణి పోర్టల్ చాలా మంచిగా ఉన్నది. ప్రభుత్వం ధరణిని ఏర్పాటు చేసినంకనే రైతుల భూములకు రక్షణ ఏర్పడింది. రైతు వేలిముద్ర సంతకం లేనిదే వేరే రైతు పేరు మీద ఉన్న భూమిని వేరొకరికి మార్చటానికి వీలుండదు. రెవెన్యూ కార్యాలయంలో ప్రస్తుతం ఎలాంటి లంచాలు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిమిషాల వ్యవధిలోనే రిజిస్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనడం ఆయన అవివేకానికి నిదర్శనం. అసలు ధరణి వ్యవస్థ అనేది రైతులకు ఎంతో మేలుచేస్తుంది.

**-గుజ్జుల పెద్దస్వామి, రైతు, నాగులపల్లి కోదేరు మండలం**

## మళ్లీ దళారులదే రాజ్యం



ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులు ఎలాంటి భూసమస్యలు లేకుండా మంచిగున్నారు. ధరణితో రైతుల భూములకు రక్షణ, భరోసాను ఇచ్చింది. రెవెన్యూ శాఖలో ఇది వరకు ఉన్న వ్యవస్థతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఒకరి పేరు మీద ఉన్న భూమిని మరొకరికి మారుస్తూ, తిరిగి మా పేరు మీద మార్చుకోవడానికి ఆఫీసుల చుట్టూ తిరిగేవాళ్లం. ప్రభుత్వం తెచ్చిన ధరణితో రైతుల భూములకు భద్రత కల్పించింది. రైతు వేలి ముద్ర, సంతకం ఉంటేనే భూమిని మార్చే పరిస్థితికి సీఎం కేసీఆర్ తీసుకొచ్చారు. ధరణితో పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్, కొన్న వారి పేరు మీద మ్యుటేషన్ అవుతున్నది. కాంగ్రెస్ నాయకులు అధికారంలో వస్తే ధరణిని రద్దు చేస్తామని చెప్పడం వారి అజ్ఞానానికి నిదర్శనం. కాంగ్రెస్‌కు అధికారం అప్పచెప్పితే భూ తగాదాలు పెరుగుతాయి. మళ్లీ పైరవీకారుల రాజ్యం వస్తుంది. రైతులు మంచిగా ఉంటే కాంగ్రెస్ నాయకులకు నచ్చదు. కాంగ్రెస్‌ను నమ్మితే రైతులు నట్టేట మునుగతారు.

**-చేగూరి మహేశ్, రైతు, కడ్తాల్ మండలం**

## కాంగ్రెస్ వస్తే.. కష్టాలు తప్పవు



కాంగ్రెస్ వస్తే రైతులకు గతం మాదిరిగానే మళ్లీ కష్టాలు తప్పవు. కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే రైతులకు నిజమైన సంతోషం. దళారి రాజ్యం తీసుకొచ్చి నిరు పేద రైతులను దోచుకునేందుకు కాంగ్రెస్ నాయకులు పన్నాగం పన్నుతున్నారు. కేసీఆర్ తెచ్చిన ధరణి పోర్టల్ ఎంతో బాగుంది. ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండా భూముల రిజిస్ట్రేషన్లతో పాటు క్షణాల్లో మ్యుటేషన్ అయిపోతున్నది. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మొత్తం దళారులు రైతులను మ్యుటేషన్ ,ఇతర భూ సమస్యలు పరిష్కరించేందుకు దోపిడీ చేసేవారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఏండ్ల తరబడి తిరిగినా పనులు అయ్యేవి కావు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయి ఒక్క రోజులోనే భూములకు సంబంధించిన పనులు ధరణితో అవుతున్నాయి. అందుకే ధరణి కొనసాగాలి. మళ్లీ సీఎం కేసీఆర్ సారే రావాలి.

**- మీసాల రాజు, చెర్కూర్, వెల్దండ మండలం**

## భూములకు భద్రత ఉండదు



కాంగ్రెస్ వద్దు బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణే ముద్దు. ధరణితోనే తమ పొలాలకు సరైన భద్రత ఉంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి రద్దు చేస్తామంటున్నారు. మళ్లీ పాత రోజులు జ్ఞాపకం వస్తాయి. వారివి సోయిలేని మాటలు. మళ్లీ పటేల్, పట్వారీల రాజ్యం వస్తది. ధరణి వచ్చిన తర్వాతనే భూముల విక్రయాలు సజావుగా సాగుతున్నాయి. దళారుల రాజ్యాన్ని తీసుకరావడానికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఎంతో లాభం చేకూర్చే ధరణిని మేం వదులుకోం. మళ్లీ సీఎంగా కేసీఆర్ సారే రావాలి.

**- మెడమోని శ్రీను, రైతు, ఉప్పునుంతల**

## ధరణి పోర్టల్ ఉంటేనే భద్రత..



రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి సీఎం కేసీఆర్‌కు రైతుల కష్టాలు ఎలా ఉంటాయో తెలుసు కనుక ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని రైతుల భూములకు భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ధరణి పోర్టల్ తీసుకువచ్చాడు. ధరణి వల్ల మా భూములకు భద్రత ఉంటుంది. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోయే పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు లేరు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ తెలంగాణ చీకట్లోకి వెళ్లిపోతుంది. రైతులకు కష్టాలు షరా మాములు కావడం ఖాయం. ధరణి వల్ల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియ కేవలం ఒక్క రోజులోనే పూర్తవుతున్నది. గతంలో అయితే రోజులు, నెల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా పని అయ్యేది కాదు. అందుకే ధరణిని కొనసాగించాలి.

**- హరికృష్ణ, రైతు, నాగర్‌కర్నూల్**

## 24 గంటల కరెంటే కావాలి..



తెలంగాణ ప్రభుత వచ్చినాక రైతుల కండ్లలో సంతోషం వచ్చింది. గతంలో వ్యవసాయం అంటే దండుగా అనుకున్నవారంతా ఇప్పుడు వ్యవసాయం అంటే పండుగ అనుకునే విధంగా సీఎం కేసీఆర్ రుజువుచేసి చూపిండు. రైతుల కోసం రెండు పంటలకు సరిపడు సాగునీరు, ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అంతేకాక రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీలతో రైతు ధీమాతో వ్యవసాయం చేసుకోవడానికి భరోసా ఇస్తుండ్రు. పదేండ్ల కిందట రైతులకు కరెంట్ సరిగా ఉండేది కాదు. అసలు ఎరువులే దొరికేది కాదు. వారు ఎప్పుడైన రైతులను పట్టించుకున్నరా. ఓట్లు వచ్చినవి కాబట్టి కాంగ్రెసోళ్లు మళ్లా ఇప్పుడు వచ్చి మాయ మాటలు చేపుతుండ్రు. వీళ్ల మాటలను నమ్మి మోసపోము. మూడు గంటల కరెంట్ వద్దు..కాంగ్రెసోళ్లు వద్దు. మాకు 24 గంటల కరెంటే కావాలి, సీఎం కేసీఆర్ సారే ఉండాలి.

**-తూముకుంట లక్ష్మీదేవమ్మ, మహిళా రైతు, జటప్రోల్, పెంట్లవెల్లి మండలం**

## కాంగ్రెసొళ్ల మాటలింటే ఆగమే..



కరెంటు విషయంలో కాంగ్రెసొళ్ల మాటలు వింటే రైతులం ఆగం కావాల్సిందే. గతంలో కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి వ్యవసాయ పొలాల దగ్గర ఉదయం రాత్రి వరకు పడిగాపులు కాసే వాళ్లం. చేతికి వచ్చిన పంటలు కండ్ల ముందే నీరు లేక ఎండిపోతుంటే చూడలేక నరకం అనుభవించినం. నేడు తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 24గంటల ఇస్తున్నందున పంటలు బాగా పండుతున్నయ్., సీఎం కేసీఆర్ రైతుల కోసం రైతుబంధు రైతు బీమా, రుణమాఫీ, నాణ్యమైన విత్తనాలు వ్యవసాయానికి ఉచితంగా 24గంటల కరెంటె ఇస్తున్నది. రైతులు పండించిన పంటకు కూడా గిట్టుబాటు ధరను కల్పిస్తున్నది. పంటను కూడా ప్రభుత్వమే కొనుగోల కేంద్రాలను ఏర్పాటు చేసి కొంటున్నది. సీఎం కేసీఆర్‌ను కాదని కాంగ్రెస్‌కు ఓటు వేస్తే పాత రోజుల మాదిరిగా రాత్రి పగలు తేడా లేకుండా వ్యవసాయ పొలాలవద్ద కాపలా కావాల్సి వస్తుంది. కాంగ్రెస్ పార్టీ వాళ్లను ఎవరూ నమ్మొద్దు. వారి మాటలు అంతా బూటకమే. ఈఎన్నికల్లో తిరిగి కేసీఆర్ ప్రభుత్వమే రావాలి మా రైతులుకు 24గంటల ఉచిత కరెంటే కావాలి.

**-వీరపాగ సాయిలు, రైతు, నాగులపల్లి, కోదేరు మండలం**

## రైతు బతుకు నాశనమే..



రైతులకు 3 గంటల కరెంట్ చాలని కాంగ్రెస్ నాయకులు మాట్లాడం అవగాహన రాహిత్యం, వ్యవసాయంపై వారికి చిత్తశుద్ధి లేదు. వారి పాలనలో కరెంట్ లేక రైతులు పొలాల వద్దనే పడిగాపులు గాశాం, కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. కరెంట్ సక్రమంగా లేకపోవడంతో వేసిన పంటలకు నీరందించలేక ఎండబెట్టుకున్నాం. రైతులందరం ఒకేసారి మోటర్లు ఆన్‌చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు ఎగిరిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయేవి. ట్రాక్టర్ మీద ట్రాన్స్‌ఫార్మర్ వేసుకపోయి రైతులందరం తలా ఇన్ని డబ్బులు జమ చేసి ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేయించుకునేవాళ్లం. ట్రాన్స్‌ఫారం వచ్చేసరికి మూడు రోజులు అయ్యేది. వ్యవసాయం చేయాలంటేనే విరక్తి కలిగేది. తొమ్మిదేండ్ల నుంచి నిరంతరంగా 24గంటల కరెంట్ రావడంతో రైతుల కష్టాలు తీరాయి. కరెంటు పోవడం లేదు రాత్రి పూట పొలాల వద్దకు వెళ్లవల్సిన అవసరం లేకుండా పోయింది. పంటలు ఎండిపోవడం అంటూ లేదు. పుష్కలంగా పంటలను పండించుకుంటున్నాం. 24 గంటల కరెంట్ వల్ల ఏ సమస్యలేదు. సీఎం కేసీఆర్ సారే మళ్లీ మరోసారి అధికారంలోకి రావాలి. కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలే మళ్లీ మొదలువుతాయి.

**- బాలునాయక్, రైతు, సూర్యతండా, ఉప్పునుంతల మండలం**

# మూడుగంటలిస్తే మునుగుడే..

- రైతు బాగుపడుతుంటే కాంగ్రెస్‌కు కండ్లమంట
- రేవంత్ నోట మూడు గంటల కరెంట్ మాట
- 10 హెచ్‌పీ మోటర్లు సరిపోతాయని అబద్ధాలు
- వ్యవసాయాన్ని భ్రష్టు పట్టించేలా హస్తం యత్నం
- ఓటుతో బుద్ధి చెబుతామంటున్న కర్షకులు

## కాంగ్రెసోళ్లకి కరెంట్ కష్టాలు తెలియవు...



కాంగ్రెస్ నాయకులకు వ్యవసాయంపై అవగాహన లేదు. వ్యవసాయానికి ఎన్ని గంటల కరెంట్ సరిపోతుంది, బోర్లకు ఏ మోటర్లు వాడతారు అనే విషయాల గురించి కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో ఎలాంటి తిప్పలు లేకుండా రెండు పంటలు పండుతున్నాయి. కాంగ్రెసోళ్లు చెప్పిన్నట్లు 3 గంటల కరెంట్‌తో 10 గుంటల పొలం తడవదు. రైతులు 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లనే వాడతారు. వ్యవసాయం తెలియని వారు చెబుతున్న 10 హెచ్‌పీ మోటర్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం పడ్డా కష్టాలు అన్ని ఇన్ని కావు. కరెంట్ కోసం అర్ధరాత్రి బావుల దగ్గరికి వెళ్లి పొలాలను నీళ్లు పారించేవాళ్లం. నోటికి వచ్చిన్నట్లు మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే మోసపోతాం. కాంగ్రెస్ పాలన వస్తే రైతులకు అంధకారమే మిగులుతుంది. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో పంటలకు కావాల్సినంత నీరు అందుతున్నది. రైతులు ఏ రంది లేకుండా వ్యవసాయం చేసకుంటున్నారు.

**- గూడూరు సురేందర్‌రెడ్డి, రైతు, కడ్తాల్ మండలం**

## పొలాల వద్ద పడిగాపులు తప్పాయి..



తెలంగాణ ప్రభుత్వంలో నిరంతరంగా 24 గంటల విద్యుత్ సరఫరాతో మోటర్ల దగ్గర తెల్లవార్లు పడిగాపులు గాసే బాధ తప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎప్పుడు కరెంటు వస్తుందో తెలియని పరిస్థితి. లో ఓల్టేజ్ సమస్యతో మోటర్లు కాలిపోయి అనేక ఇబ్బందులు చూసాం. ఇప్పుడు కాంగ్రెస్ వస్తే 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నారు. మూడు గంటలే కరెంటు ఇస్తామని చెప్పుతున్నారు. 10హెచ్‌పీ మోటర్లు కొనుగోలు చేయాలంటే రైతుల ఆర్థిక పరిస్థితి అంతంతగా ఉంటుంది. హై పవర్ మోటర్లు పెట్టుకుంటే మోటర్లు కాలిపోయి అప్పుల బాధ పెరుగుతుంది. ఇప్పుడు కరెంటు సమస్య తగ్గి రెండు పంటలకు కరెంటు నిరంతరం వస్తుండడంతో పంటలు పండించుకుంటున్నాం. కాంగ్రెస్ వస్తే ఒక్క పంట కూడా సక్కగా పండించుకొని రోజులు వస్తాయి. తలుచుకుంటేనే భయమేస్తుంది.

**- రాములు, రైతు, కొత్త యాపట్ల, పెద్దకొత్తపల్లి మండలం**

## రైతులు ఇబ్బంది పడే పరిస్థితి వస్తది..



కాంగ్రెస్ పార్టీ నాయకులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారు. వారికి వ్యవసాయం చేయడం తెలిసుంటే మూడు గంటల కరెంట్ చాలని చెప్పేవారు కాదు. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి ఇచ్చిన కరెంట్ ఉదయం ఇచ్చేవారే.. రాత్రిపూట ఇచ్చేవారో అర్ధరాత్రి పూట ఇచ్చేవారో అర్థం కాని పరిస్థితి ఉండేది. ఒక్కోసారి అర్ధరాత్రి వేళ పొలం వద్దకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉండేది. బీఆర్ఎస్ పార్టీ వచ్చాక కరెంట్ సమస్యలు తీరాయి. 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందిస్తోంది. 24గంటల కరెంట్ సరఫరా చేస్తుండడంతో ఏటా రెండేసి పంటలు పండిస్తున్నాం. మూడు గంటలు కరెంట్ ఇస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు.. కాంగ్రెస్ నాయకుల మాటలు రైతులు నమ్మే స్థితిలో లేరు.

**- సైదులు, రైతు,కల్వకుర్తి**

## పాతరోజులు రావడం ఖాయం



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. నాకు బాడుగదిన్నె శివారులో 20 ఎకరాల భూమి ఉన్నది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మూడు గంటల కరెంటుతో ఒక్క ఎకరా భూమి మాత్రమే నీళ్లు పారేవి. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 24 గంటల ఉచిత విద్యుత్ నిరంతరంగా అందుతండటంతో రైతులు ఎప్పుడు పొలాలకు వెళ్లినా మోటరు వేసుకొని సాగు చేసుకునే అవకాశం ఉన్నది. 10 హెచ్‌పీ మోటరు ద్వారా గంటలో ఎకరం నీరు పారించవచ్చని రేవంత్‌రెడ్డి చెప్పడం పచ్చి అబద్ధం. కేసీఆర్ వచ్చాకే రాత్రి పూట పొలాల వద్ద నిద్రిందేది పరిస్థితి బంద‌య్యింది. ఒక వేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల పరిస్తితి ఎలా ఉంటుందోనని భయం పట్టుకున్నది. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతది. గతంలో అరకొర విద్యుత్‌తో మోటర్లు, స్విచ్‌బోర్డులు కాలిపోయేవి. ఇప్పుడు 24 గంటల కరెంట్‌తో 20 ఎకరాల్లో రెండు కార్లు పంటలు పండించుకుంటున్నాం. మళ్లీ కేసీఆర్ సీఎం అయితే రైతులకు ఇబ్బందులు ఉండవు.

**- బైరపోగు బాలపీరు, రైతు, బాడుగదిన్నె, కోడేరు మండలం**

## కాంగ్రెస్‌ను రైతులు నమ్మరు..



కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కష్టాలతో ధర్నాలు రాస్తారోకోలు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంటు సక్రమంగా లేక లోఓల్టేజ్ సమస్యతో మోటర్లు కాలిపోయేది. కరెంటు కోసం పొలాల దగ్గర పడి కాపులు కాసేవారం. సీఎం కేసీఆర్ రైతులకు 24గంటల కరెంటు ఇవ్వడంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండు పంటల సాగు చేసుకుంటున్నారు. మూడు గంటల కరెంటు ఇస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు. కాంగ్రెస్ నాయకుల మాటలు గ్రామాల్లో నమ్మే స్థితిలో ఎవరు లేరు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత మంచి సంస్కరణలు చేపడుతున్న సీఎం కేసీఆర్‌కు రైతుల మద్దతు ఉంటుంది. మూడోసారి సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి కావడానికి గ్రామాల్లో రైతుల మద్దతు ఉంటుంది.

**- శేఖర్‌రెడ్డి, రైతు, చిన్నకారుపాముల, పెద్దకొత్తపల్లి మండలం**

## కాంగ్రెస్ మాయమాటలు నమ్మితే ఆగమే..



కాంగ్రెసోళ్లు చెప్పే మాయా మాటలను నమ్మితే రైతులందరూ ఆగమైతారు. సీఎం కేసీఆర్ అందిస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో మంచిగా పంటలు పండిచుకుంటున్నాం. కాంగ్రెస్ నాయకులు ఇస్తామన్నా 3 గంటల కరెంట్‌తో ఎకరం పొలం కూడా తడవది. కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎప్పుడు వచ్చేదో? ఎప్పుడు పోయేదో తెలవకుండే. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. పొలాలకు మాపటేల వదిలే కరెంట్ కోసం కండ్లు కాసేలా ఎదురుచూసేవాళ్లం. సీఎం కేసీఆర్‌కి ఏవుసం గురించి తెలుసు కాబట్టే రైతులకు 24గంటల కరెంట్ ఇస్తుండు. ఎలాంటి బాధలు లేకుండా రైతులు రెండు పంటలతోపాటు కూరగాయాలను పండిస్తున్నాం. కాంగ్రెస్‌కి ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు షురూ అవుతాయి. ఏవుసం మీద అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు 3 గంటల కరంట్ ఇస్తాం... 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోమని చెబుతుండ్రు. రైతులు మంచిగా బతుకుతుంటే కాంగ్రెస్ నాయకులు ఓరుస్తాలేరు. రైతులను కంటికి రెప్పాల కాపాడుతున్న సీఎం కేసీఆర్‌కే నా మద్దతు.

**- గాజుల జైపాల్‌రెడ్డి, రైతు, కడ్తాల్ మండలం**